

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సన్మానిస్తున్న రాంనగర్ కాకతీయ హైస్కూల్ కరస్పాండెంట్ గోక నవీన్, ప్రిన్సిపాల్ రామరాజు తదితరులు

'పది'లో కాకతీయ హైస్కూల్ 100 శాతం ఉత్తీర్ణత

రాంనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షాఫలితాల్లో రాంనగర్‌లోని కాకతీయ హైస్కూల్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించి, డిప్యూటీ డీఈఓ మండల పరిధిలో రికార్డు నెలకొల్పారు. ఈ పాఠశాలలోని 35మంది విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం జరిగిన పదోతరగతి పరీక్షలకు హాజరుకాగా అందరూ ఉత్తీర్ణత సాధించినట్లు పాఠశాల కరస్పాండెంట్ గోక నవీన్, ప్రిన్సిపాల్ రామరాజు బుధవారం తెలిపారు. పాఠశాలకు చెందిన తీగల స్నేహన్స 583 మార్కులు, కడిమి ఆదర్శ్ 572, సురంపల్లి శృతిక 562, వెంకటలక్ష్మన్య 549 మార్కులు సాధించినట్లు చెప్పారు. మొత్తం విద్యార్థుల్లో 500పైగా మార్కులు సాధించిన వారు 17మంది ఉన్నారని, 450 నుంచి 500లోపు వచ్చిన వచ్చిన వారు ఆరుగురు ఉన్నారని, 400 నుంచి 450 మార్కులు వచ్చిన వారు 12మంది ఉన్నట్లు వారు తెలిపారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను పాఠశాల ఆవరణలో సన్మానించి, శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు మాట్లాడుతూ పాఠశాల యాజమాన్యం అందించిన ప్రోత్సాహం, ఉపాధ్యాయులు చేసిన బోధన వల్ల తాము ఉత్తమ మార్కులు సాధించామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు స్వీట్లు పంపిణీ చేశారు. బాణా సంచా కాల్చి సందడి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఏవో జ్యోతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జీవితానికి పరీక్షాఫలితాలు ప్రామాణికం కాదు

చిక్కడపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): జీవితానికి పరీక్షా ఫలితాలు ప్రామాణికం కాదని ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షురాలు డా.హిప్నో పద్మాకమలాకర్ అన్నారు. పదోతరగతి, ఇంటర్ పరీక్షల ఫలితాలు విడుదలైన నేపథ్యంలో విద్యార్థుల్లో పెరుగుతున్న మానసిక ఒత్తిడి, ఆత్మహత్యలపై బుధవారం అశోక్‌నగర్‌లోని డా.హిప్నోకమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీకేర్ హాల్‌లో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మంచి ఫలితాలు వచ్చిన విద్యార్థులు ఆనందిస్తుంటే తగినరీతిలో రానివారు తీవ్ర మానసిక ఒత్తిడితో బాధపడుతున్నారన్నారు. 90 శాతం వచ్చిన కూడా కొంతమంది తట్టుకోలేక ఆత్మహత్యలు చేసుకోవడం మనసును కలిచివేసే విషయమని ఆవేదన వ్యక్తం చేశారు. పరీక్షలో ఫెయిలయ్యాడని విద్యార్థి తన ప్రాణాన్ని తీసుకోవడం వ్యక్తిగత వైఫల్యం కాదని ఇది సమాజ వైఫల్యం అన్నారు. పిల్లల మనోబలానికి దన్నుగా తల్లిదండ్రులు నిలవాలన్నారు. ఉచితంగా వారం రోజులపాటు విద్యార్థులకు ప్రతి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కౌన్సెలింగ్ సేవల కోసం 9390044031 నెంబర్‌కు కాల్ చేయవచ్చునని తెలిపారు.

ఇంగ్లిష్ యూనియన్ హైస్కూల్‌లో వందశాతం ఉత్తీర్ణత

కవాడిగూడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షా ఫలితాల్లో ఇంగ్లిష్ యూనియన్ హైస్కూల్ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించారని కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణలతారెడ్డి తెలిపారు. పదో తరగతి పరీక్షలు 183 మంది విద్యార్థులు రాయగా, 183 మందీ ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. పాఠశాలలో 579 ఉత్తమ మార్కులు సాధించిన శివప్రియతోపాటు మరి కొంతమంది విద్యార్థులకు పూలబొకే అందజేసి, వారికి శుభాకాంక్షలు తెలియజేశారు.



ఉత్తమ మార్కుల విద్యార్థినికి పూలబొకే ఇస్తున్న ఇంగ్లిష్ యూనియన్ హైస్కూల్ కరస్పాండెంట్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ స్వర్ణలతారెడ్డి



జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌కు పూలబొకే అందజేస్తున్న జిల్లా డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు నందగిరి నర్సింహ, తదితరులు

పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

ముషీరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): భోలక్‌పూర్ డివిజన్‌లో దశాబ్దాకాలంగా పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులకు నిధులు విడుదలచేసి, సమస్యలు పరిష్కరించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, హైదరాబాద్ జిల్లా డెవలప్‌మెంట్ కమిటీ సభ్యుడు నందగిరి నర్సింహ, జీహెచ్ఎంసీ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. బుధవారం భోలక్‌పూర్ డివిజన్‌కు చెందిన వివిధ పార్టీల నాయకులు నందగిరి నర్సింహ ఆధ్వర్యంలో జీహెచ్ఎంసీ నూతన కమిషనర్ ఆర్‌వీ.కర్ణన్‌ను కలిసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు చంద్రమోహన్, సత్యనారాయణ, రవికుమార్, ధర్మేందర్, లక్ష్మణ్ పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు చట్టానికి వ్యతిరేకంగా నిరసన

ముషీరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం వక్ఫ్ బోర్డుకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన కొత్త చట్టాన్ని వ్యతిరేకిస్తూ ముషీరాబాద్, భోలక్‌పూర్‌లోని మసీదులలో ముస్లింలు నిరసన వ్యక్తం చేశారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపుమేరకు బుధవారం సాయంత్రం విద్యుత్ దీపాలు ఆఫ్ చేసి నిరసన వ్యక్తం చేశారు. బడీ మసీదు, బిలాల్ మసీదు, గుల్షన్‌నగర్ మసీదు తదితర ప్రాంతాల్లో ముస్లింలు విద్యుత్ దీపాలను ఆర్పివేసి నిరసన వ్యక్తం చేశారు. అంతకుముందు ముస్లిం మతపెద్దలు, బీఆర్ఎస్ నాయకులు అక్లాక్‌హుస్సేన్, మహ్మద్అలీ, మున్వర్‌చాంద్, సబీల్‌అహ్మద్ తదితరులు ఇంటింటికీ వెళ్లి ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆదేశాలకు అనుగుణంగా నిరసన వ్యక్తం చేయాలని విజ్ఞప్తులు చేశారు.

నేటి తరానికి ఓంకార్ ఆదర్శం

రాంనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): నేటి తరానికి ఓంకార్ ఆదర్శం అని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ అన్నారు. బాగ్‌లింగంపల్లి ఓంకార్ భవన్‌లో ఓంకార్ శతజయంతి వార్షికోత్సవ లోగోను బుధవారం జస్టిస్ చంద్రకుమార్ ఆవిష్కరించారు. చంద్రకుమార్ మాట్లాడుతూ ఓంకార్ రాజకీయాలను సేవగా భావించి ప్రజల కోసం ఆహోరాత్రులు పోరాడిన నేత అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంసీపీఐయూ కార్యదర్శి గాదగోని రవి, వనం సుధాకర్, కుంభం సుకన్య, మల్లేష్, అనిల్‌కుమార్, మురళి, కిష్టయ్య, దానయ్య పాల్గొన్నారు.



పనులను పరిశీలించిన కృష్ణప్రసాద్, గౌతమ్‌రావు, నాగభూషణం చారి తదితరులు

ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ పనుల పరిశీలన

అంబర్‌పేట, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఈనెల 5వ తేదీన అంబర్‌పేటలో ప్రారంభం కానున్న ఛేనెంబర్ ఫ్లైఓవర్ వద్ద పనులను నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా(ఎన్‌హెచ్ఏఐ) ప్రతినిధులు కృష్ణప్రసాద్, ధర్మారెడ్డి బీజేపీ నేతలు డా.ఎస్.గౌతమ్‌రావు, నాగభూషణం చారి తదితరులతో కలిసి బుధవారం పరిశీలించారు. కేంద్రమంత్రులు నితిన్ గడ్కరీ, కిషన్‌రెడ్డి సోమవారం ఐదో తేదీన ఫ్లైఓవర్‌ను ప్రారంభిస్తారని వారు పేర్కొన్నారు. బీజేపీ నేతలు నరేష్‌గౌడ్, ఏదెల్లి అజయ్‌కుమార్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

పదిలో సత్తాచాటిన ప్రభుత్వ విద్యార్థులు

కవాడిగూడ, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కవాడిగూడ ప్రభుత్వ పాఠశాలలో పదోతరగతి పరీక్షా ఫలితాల్లో 92శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రభుత్వ పాఠశాల ప్రిన్సిపాల్ మీనాకుమారి తెలిపారు. పాఠశాల నుంచి మొత్తం 49 మంది ఇంగ్లిష్‌మీడియం విద్యార్థులకు పరీక్షకు హాజరుకాగా 45మంది ఉత్తీర్ణత సాధించారని తెలిపారు. పాఠశాలలో అత్యధికంగా సీహెచ్.ఉమాదేవి 518 మార్కులు, ద్వితీయ స్థానంలో కుసుమ 487 మార్కులు సాధించినట్లు ఆమె తెలిపారు. గత సంవత్సరం పాఠశాల నుంచి 59 మంది విద్యార్థులలో ఇంగ్లిష్‌మీడియం నుంచి 52 మంది, తెలుగు మీడియం నుంచి ఏడుగురు పరీక్షలకు హాజరై 78శాతం ఉత్తీర్ణత సాధించారని ఆమె తెలిపారు. పాఠశాలలో తెలుగు మీడియం విద్యార్థులు ఎవరూ లేకపోవడంతో తెలుగుమీడియం ఎత్తివేసినట్లు ఆమె తెలిపారు.



ఉమాదేవి(518)



కుసుమ(487)

కవాడిగూడ ప్రభుత్వ పాఠశాలలో 92శాతం ఉత్తీర్ణత

పదోతరగతి ఫలితాల్లో అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. హిమాయత్‌నగర్ ఎడ్యూకేషన్ జోన్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి ఫలితాల్లో 89.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. 13 ప్రభుత్వ పాఠశాలల్లో 473 మంది ఉత్తీర్ణులయ్యారు. మూడు ప్రభుత్వ పాఠశాలలు నూరు శాతం ఫలితాలు సాధించాయి. ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని మొత్తం 7 ఉన్నత పాఠశాలల నుంచి 329 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 308 మంది పాసయ్యారు. ముషీరాబాద్ విద్యామండలి పరిధిలో 94 శాతం ఉత్తీర్ణత వచ్చిందన్నారు. ప్రణాళికాబద్ధంగా చదివించడంతో ఉత్తమ ఫలితాలు సాధ్యమయ్యాయని ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈవో శ్రావణ్ కుమార్ తెలిపారు.

7 పాఠశాలల పరిధిలో 94 శాతం ఉత్తీర్ణత

ముషీరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 10వ తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులు సత్తాచాటారు. జమిస్తాన్‌పూర్ (రాంనగర్) ప్రభుత్వ ఉన్నతపాఠశాల విద్యార్థులు 100శాతం ఉత్తీర్ణత సాధించారు. మరో ఆరు ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 97 నుంచి 92శాతం ఉత్తీర్ణులు అవ్వడం విశేషం. మండల పరిధిలో ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వపాఠశాల విద్యార్థులు మంచి ఫలితాలు సాధించడంతో ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలో 94 శాతం ఉత్తీర్ణత సాధించారు.

మండల పరిధిలో 7 ప్రభుత్వ పాఠశాలలు

ముషీరాబాద్ విద్యామండలి పరిధిలోని మొత్తం 7 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 329 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 308 మంది విద్యార్థులు పాసయ్యారు. జమిస్తాన్‌పూర్ (రాంనగర్ హైస్కూల్) విద్యార్థులు 17 మంది పరీక్షలు రాయగా 17 మంది ఉత్తీర్ణత సాధించారు. నల్లకుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 29మంది పరీక్షలు రాయగా 28మంది విద్యార్థులు పాసయ్యారు. 97శాతం ఉత్తీర్ణత సాధించారు. సీతాఫల్‌మండి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 60మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 58మంది పాసయ్యారు. 97శాతం ఉత్తీర్ణత సాధించారు. ముషీరాబాద్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 77మంది విద్యార్థులు పరీక్ష రాయగా 70మంది పాసయ్యారు. 97శాతం ఉత్తీర్ణత సాధించారు. జామాఉస్మానియా ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 69 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 64మంది పాసయ్యారు. 93శాతం ఉత్తీర్ణత సాధించారు. మానికేశ్వర్‌నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 28మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 26మంది పాసయ్యారు. 93శాతం ఉత్తీర్ణత సాధించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ముషీరాబాద్ డిప్యూటీ డీఈవో శ్రావణ్ కుమార్, ముషీరాబాద్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు స్వరూపారాణి

సత్తాచాటిన అనాథాశ్రమం విద్యార్థులు

ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలోని రెయిన్‌హోం అనాథాశ్రమంలో ఉంటూ 10వ తరగతి పరీక్షలు రాసిన విద్యార్థులు సత్తాచాటారు. రెయిన్‌బోహోంలో ఉంటూ చదువుకున్న 8మంది విద్యార్థినులు పరీక్షలు రాయగా 8మంది పాసయ్యారు. కృతిమకు 498 మార్కులు, సుమతి కి 434 మార్కులు, భార్గవికి 410 మార్కులు వచ్చాయి. వారిని రెయిన్‌బో హోం అనాథాశ్రమం ఇన్‌చార్జి మమతా జైస్వాల్, సదాలక్ష్మి అభినందించారు.



అనుష్క (600/532)



ఎ.కృతిమా (600/498)



వి.విజేత



జయశాస్త్రీ



యామిని



మాధురి

13 ప్రభుత్వ పాఠశాలల్లో 473 మంది ఉత్తీర్ణత

బర్కత్‌పుర: హిమాయత్‌నగర్ ఎడ్యుకేషన్ జోన్ పరిధిలోని 13 ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి పరీక్షల్లో 89.5 శాతం ఉత్తీర్ణత సాధించారు. 528 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 473మంది ఉత్తీర్ణులు అయ్యారు. పోలీస్ బాయ్స్ హైస్కూల్‌కు చెందిన వి.విజేత 600కు 567 మార్కులు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. ఈ జోన్ పరిధిలో 3 ప్రభుత్వ పాఠశాలలు నూరు శాతం ఉత్తీర్ణత సాధించాయి. జీజీహెచ్ఎస్ అంబర్‌పేటలో 21మంది విద్యార్థులు పరీక్ష రాయగా 21 మంది ఉత్తీర్ణులు అయ్యారు. అంబర్‌పేట ప్రభుత్వపాఠశాల్లో 18మంది విద్యార్థులు పరీక్ష రాయగా 18మంది ఉత్తీర్ణులయ్యారు. పోలీస్ బాయ్స్ హైస్కూల్‌కు చెందిన జయశాస్త్రీ 565 మార్కులు, హిమాయత్‌నగర్ గౌట్ పీఆర్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని యామిని 555 మార్కులు, మలక్‌పేట డెఫ్ స్కూల్‌లో 16మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 16మంది ఉత్తీర్ణులు అయ్యారు. మలక్‌పేట హైస్కూల్‌లో మాధురి 539 మార్కులు సాధించింది. కాచిగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 87 శాతం ఉత్తీర్ణత వచ్చింది. జీజీహెచ్ఎస్ మలక్‌పేటలో 52మంది విద్యార్థులు పరీక్ష రాయగా 48మంది ఉత్తీర్ణులయ్యారు. మంచి మార్కులు సాధించిన విద్యార్థులను హిమాయత్‌నగర్ ఎడ్యుకేషన్ జోన్ డిప్యూటీ డీఈవో ఆస్రా ఫాతిమా, మాజీ డిప్యూటీ డీఈవో విజయలక్ష్మి అభినందించారు.

దైవభక్తికి నిదర్శనం లింగాయత్‌లు



బసవేశ్వర చిత్రపటానికి నివాళులర్పించిన ఎమ్మెల్యే గోపాల్

ముషీరాబాద్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): దైవభక్తి, సమాజ మార్పుకు నిదర్శనం లింగాయత్‌లు అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం వీరశైవ లింగాయత్ సమాజం ముషీరాబాద్ కమిటీ ఆధ్వర్యంలో మహాత్మా బసవేశ్వర జయంతి కార్యక్రమాన్ని ముషీరాబాద్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే గోపాల్ మహాత్మా బసవేశ్వర చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బసవేశ్వర స్వామి సమాజ సేవకు ఎంతో కృషిచేశారని పేర్కొన్నారు. అ ఈ కార్యక్రమంలో వీరశైవ లింగాయత్ సమాజం రాష్ట్ర కమిటీ సలహాదారులు ఆర్ విశ్వేశ్వర్, శివశరప్పాలు, వీరశైవ లింగాయత్ సమాజం ముషీరాబాద్ అధ్యక్షుడు గౌరీశంకర్, ఉపాధ్యక్షులు శివకుమార్, కళ్యాణ్, మల్లేష్, ప్రధాన కార్యదర్శి వీరేందర్, కమిటీ సభ్యులు మహేష్, బీఆర్ఎస్ నాయకులు శివముదిరాజ్, పి.శ్రీధర్‌చారి, ఆకుల అరుణ్ కుమార్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి నిధులు మంజూరు

రాంనగర్: ముషీరాబాద్ నియోజకవర్గంలో డ్రైనేజీ వ్యవస్థ ఆధునికీకరణకు దశలవారీగా నిధులను కేటాయిస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ తెలిపారు. అడిక్‌మెట్ డివిజన్‌లోని లక్ష్మమ్మ పార్కు వెళ్లే మార్గంలో రూ.15లక్షలతో ఏర్పాటు చేయనున్న డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు.



నేరెళ్ల శారదకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ప్రపంచ అందాల పోటీలను రద్దు చేయాలి

రాంనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): 72వ ప్రపంచ సుందరి అందాల పోటీలను వ్యతిరేకిస్తూ వాటిని రద్దు చేయాలని కోరుతూ మిస్‌వరల్డ్ అందాల పోటీల వ్యతిరేక పోరాట వేదిక సభ్యులు బుధవారం మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారదకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వేదిక సభ్యులు మల్లు లక్ష్మి, వి.సంధ్య, ఆర్.అరుణజ్యోతి, హేమలత, లక్ష్మీబాయ్, స్వరూప, జ్యోతి మాట్లాడుతూ అందాల పోటీలు మహిళా సాధికారతకు సంకేతం కాదన్నారు.

అత్యున్నత చైతన్య మహాకావ్యం మహాప్రస్థానం

చిక్కడపల్లి,: ప్రపంచ సాహిత్య చరిత్రలో అత్యున్నత చైతన్య మహాకావ్యం మహాకవి శ్రీశ్రీ రచించిన మహాప్రస్థానం అని వేంకటేశ్వర యూనివర్సిటీ పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. సామ్యవాద భావనలతో అభ్యుదయ ఆలోచనలతో నిండిన గొప్ప కవి శ్రీశ్రీ అన్నారు. త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో బుధవారం ఎందరో మహానుభావులు కార్యక్రమ పరంపరలో భాగంగా మహాకవి శ్రీశ్రీ జయంతి యాదిలో సంస్మరణ సమావేశం గానసభ అధ్యక్షుడు కళా జనార్దన మూర్తి అధ్యక్షతన జరిగింది. గాయకులు శ్రీధరం రామసుబ్రహ్మణ్యం, గానసభ పాలకవర్గ సభ్యురాలు గుండవరపు గీతాదేవి, జర్నలిస్ట్ దేవసేన తదితరులు పాల్గొన్నారు.

శ్రీశ్రీ పీడితపక్షం ఆయన బాట ప్రజామార్గం

రాంనగర్: అక్షరాలతో అగ్గిరవ్వలు పుట్టించి చందస్సు సంకెళ్లను తెంచేసి ఆధునిక కవిత్వానికి అంటుగట్టిన ప్రజాకవి శ్రీశ్రీ అని తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం(టీపీఎస్‌కే) అధ్యక్షుడు బి.వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో శ్రీశ్రీ జయంతి సభ టీపీఎస్‌కే ఆధ్వర్యంలో జరిగింది.

రాజ్యాంగాన్ని రక్షించుకోవాలి

రాంనగర్, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ హక్కుల కోసం డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ రాసిన భారత రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు గజ్జెల దశరథ్ అన్నారు. రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రలను బీజేపీ మానుకోవాలన్నారు. బుధవారం దోమలగూడలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, భారత రాజ్యాంగ పరిరక్షణ కోసం రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి ప్రజలందరూ మద్దతు ఇవ్వాలన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ జనహిత ర్యాలీ

చిక్కడపల్లి, ఏప్రిల్ 30 (ఆంధ్రజ్యోతి): కశ్మీర్‌లో ఉగ్రవాద దాడిని నిరసిస్తూ జనహిత ఫ్రెండ్స్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో బుధవారం గాంధీనగర్ డివిజన్ జవహర్‌నగర్‌లో బస్తీదవాఖాన నుంచి సాయి సెక్యూరిటీ సంస్థ మీదుగా జనహిత గ్రౌండ్(టీఆర్‌టీ గ్రౌండ్) వరకు నిరసన ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నేత దోనేటి సత్యం పర్యవేక్షణలో జరిగిన ఈ ర్యాలీలో అసోసియేషన్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, రాజ్‌మోహన్, సాయిచంద్, డీఎస్.రెడ్డి, కృష్ణ, మైఖేల్, రవిమన్యు తదితరులు పాల్గొన్నారు.